సీనియారిటీపై అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న కెజిబివి టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు, మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, మొదలగు పోస్టులకు రిక్వెస్ట్/మ్యూచువల్ రీప్లేస్మెంట్ కోసం దరఖాస్తులు చేసుకున్నవారి సీనియారిటీ లిస్టు vizianagaram.ap.gov.in లో పొందుపర్చినట్లు సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 27లోగా జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయం పని వేళల్లో సమర్పించాలని తెలిపారు.

జిల్లా అభివృద్ధికి పుష్కలమైన వనరులు ఉన్నాయని, వాటన్నింటినీ సద్వినియోగం చేసి వికాస ప్రయత్నాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఎయిర్‌పోర్టు భూసేకరణ విషయంలో రైతులను పూర్తిస్థాయిలో సంతృప్తి పరిచి, కోర్టు వివాదాలు కూడా పరిష్కరించామని వివరించారు. పనులు కూడా త్వరితగతిన ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఇకపై గిరిజన విశ్వవిద్యాలయం భవన నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. మెడికల్ కళాశాలలో కూడా స్థాయికి తగ్గ ప్రమాణాలు సమకూర్చుతున్నామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందుకనుగుణంగానే సదస్సులు నిర్వహించి, అర్జీలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులను బాధితులు సంతృప్తి చెందేలా సకాలంలో స్పందించి పరిష్కారం చూపుతున్నట్టు చెప్పారు. ఎసిఎస్ఆర్ నిధులతో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలు మెరుగు పరిచామని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ, బిందు,తుంపర్ల సేద్యం, సేంద్రీయ వ్యవసాయాన్ని ఈ ఏడాది పెద్దఎత్తున ప్రోత్సహించామని వివరించారు. కలెక్టర్‌గా అంబేద్కర్ అధికార బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయింది. మరోవైపు ఏడాది పాలనపై ప్రభుత్వం కూడా కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలతో సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణ సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఈనేపథ్యంలో తనను కలిసిన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే....

జిల్లా అభివృద్ధికి పుష్కల అవకాశాలు

- పారిశ్రామిక వృద్ధికి 275.67 ఎకరాలు కేటాయింపు
- ఎయిర్‌పోర్టు భూ వివాదాలన్నీ పరిష్కరించాం
- గిరిజన వర్శిటీ భవన నిర్మాణాలు వేగవంతం
- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పెద్దపీట
- పిజిఆర్ఎస్ వినతులకు సకాలంలో పరిష్కారం
- వ్యవసాయ యాంత్రీకరణ, బిందు, తుంపర్ల సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఏడాది పాలనపై ప్రజాశక్తితో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా ఎక్కువ శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడింది. ఈ నేపథ్యంలో తోటపల్లి బ్యారేజ్ కుడికాలువపై నిర్మిస్తున్న గజపతినగరం బ్రాంచ్ కెనాల్ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నాం. తద్వారా గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాలకు 15,000 ఎకరాలకు సాగునీరు అందడానికి అవకాశం ఉంటుంది. రామతీర్థ సాగర పనులు కూడా ముమ్మరం చేస్తాం. 2,97,540 మంది రైతులకు రూ.123 కోట్ల విలువగల వివిధ అధునాతన వ్యవసాయ పరికరాలు మంజూరు చేశాం. సుమారు వెయ్యి మంది రైతులకు రూ.418.93 లక్షల రాయితీపై బిందుసేద్యం పరికరాలు మంజూరు చేసి స్ప్రింక్లర్లు, డ్రిప్పులు ఏర్పాటుచేశాం. సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సాహంలో భాగంగా గత ఏడాది 21,547 హెక్టార్ల విస్తీర్ణం నుంచి 58,171 హెక్టార్లకు పెంచాం. జిల్లాలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రహదారులు, భూమి, నీరు వంటి వనరులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రతి నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా జిల్లాలో గల ఏడు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు కోసం 275.67 ఎకరాల భూమిని కేటాయించాం. సేవా రంగానికి మంచి అవకాశాలు ఉన్నాయి. ఎయిర్‌పోర్టు పూర్తి అయ్యే నాటికి ఆ చుట్టుపక్కల పెద్దపెద్ద స్టార్ హోటళ్ల నిర్మాణం జరిగే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తీర ప్రాంతంతోపాటు జిల్లాలో తాటిపూడి, రామతీర్థం, చింతపల్లి సముద్రతీరం తదితర చోట్ల టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా జిల్లా ఏటా 15శాతం వృద్ధి సాధనకు జిల్లా, మండల, నియోజకవర్గం ప్రణాళికలు సకాలంలో ప్రభుత్వానికి అందజేశాం. కార్యాచరణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించి శిక్షణ కూడా ఇచ్చాం.

ప్రజారోగ్య పరిరక్షణ కోసం పరిసరాల పరిశుభ్రత, రక్షిత తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వంటివాటి ప్రాధాన్యతనిస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా 47శాతం ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. ఆసుపత్రుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉంటోంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. తరగతి గదులు, ఇతర సదుపాయాలకు రూ.56.14కోట్ల అంచనా వ్యయంతో 383 పనులు మంజూరు చేశాం. ఇందులో 125 పనులు పూర్తయ్యాయి. రూ.కోట్ల సిఎస్ఆర్ సిఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆసుపత్రుల్లో ప్రమాణాలు మెగురుపర్చాం. రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన 6903 అర్జీలకు పరిష్కారం చూపాం. రీ-సర్వే సమస్యలపై వచ్చిన 23097 గ్రీవెన్స్‌ను కూడా పరిష్కరించాం. పిజిఆర్ఎస్‌లో అర్జీదారులు సంతృప్తిపడేలా చర్యలు తీసుకున్నాం. జిల్లా వ్యాప్తంగా 15,980 మంది నిరుద్యోగ యువతకు వివిధ వత్తి విద్య కోర్సుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చాం. వివిధ కంపెనీల్లో 5,162 మందికి ఉద్యోగాలు కూడా కల్పించాం. ఏడాదిలో రూ.745.88 కోట్ల అంచనా వ్యయంతో 5016 పంచాయతీరాజ్ రోడ్లు చేపట్టి, ఇప్పటి వరకు 2335 పూర్తిచేశాం. రూ.23.52 కోట్లతో 176 ఆర్అండ్‌బి రోడ్ల మరమ్మత్తులు పూర్తిచేశాం. రూ.294.47 కోట్ల నాబార్డు, ఎన్‌డిబి నిధులతో మంజూరైన 48 రోడ్లు, భవనాల్లో 23వరకు పూర్తిచేశాం. వేగావతి నదిపై పెండింగులోవున్న పారాది హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నాయి. ఓటర్ల నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకుగాను బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు - 2024 అందుకోవడం నాకెంతో సంతోషానిచ్చింది. జిల్లా అధికారులను నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను. ఇందుకు తగ్గట్టే అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు నా వంతు కృషి చేస్తాను.

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి

పొదుపు మహిళల సమస్యలపై ఉద్యమం

సదస్సులో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏ లక్ష్యంతో పొదుపు సంఘాలు పెట్టారో ఆ లక్ష్యం నేరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి అన్నారు. మంగళవారం ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.పుణ్యవతి అధ్యక్షతన ఎన్‌పిఆర్ భవనంలో డ్వాక్రా మహిళల జిల్లా అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సిహెచ్ రమణి మాట్లాడుతూ పొదుపు చేసిన డబ్బులు లక్ష నుంచి ఐదు లక్షలు వరకు బ్యాంకులలో ఉన్నాయని, పొదుపు ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇస్తామనడం సరికాదని అన్నారు. స్త్రీ నిధి రుణాలులో అనేక లోపాలు ఉన్నాయన్నారు. సక్రమంగా కట్టినా అధిక వడ్డీలు తీసుకుంటున్నారని తెలిపారు. విజయనగరం జిల్లా కళ్లేపల్లి గ్రామంలో 18 లక్షలు వరకు అవినీతి జరిగితే ఐద్వా పోరాడి సుమారుగా 13 లక్షలు వరకు ఇప్పించిందని తెలిపారు. పెన్షన్ ఇస్తామని చెప్పి మహిళలు నుంచి వసూలు చేసిన అభయ హస్తం డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అత్యధిక బ్యాంక్ లు డ్వాక్రా మహిళలకు గౌరవం ఇవ్వడం లేదన్నారు. అప్పును సక్రమంగా కట్టినా వారు ఎవరైనా ఉన్నారంటే వారు డ్వాక్రా మహిళలే అన్నారు. పొదుపు మహిళలు సమస్యలు పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పొదుపు డబ్బులపై బ్యాంకుల పెత్తనం సరికాదన్నారు. ఎపిజివిబి బ్యాంకు మేనేజర్ శిరీష్ మాట్లాడుతూ ఎటువంటి సెక్యూరిటీ లేకుండా గ్రూపు సభ్యులు సంతకాలతో రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. దాచుకున్న పొదుపు అమౌంట్ ఆధారంగా రూ.50,000 నుంచి రూ20లక్షలు వరకు రుణాలు ఇస్తున్నామన్నారు. రెన్యువల్ సరిగ్గా కట్టకపోతే అదనపు భారమనేది ఉంటుందన్నారు. సక్రమంగా ఇచ్చిన రుణాలు చెల్లించి తద్వారా ఆర్థిక అభివద్ధికి మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు నామమాత్రంగానే ఇస్తున్నారని, మైక్రో ఫైనాన్స్ అప్పులు కారణంగా మహిళలు రోడ్డున పడుతున్నారని అన్నారు. బ్యాంకులు ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. సదస్సులో జిల్లా సహాయ కార్యదర్శులు జి.పుణ్యవతి, వి.లక్ష్మి, సహాధ్యక్షులు అర్.కృష్ణవేణి, జిల్లా కమిటీ సభ్యులు జి.అరుణ, డి.కరుణ, సిహెచ్ కృష్ణవేణి, మహిళలు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు తరలించండి

లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని గాజుల రేగ సమీపంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలోకి తరలించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను కోరారు మంగళవారం జిల్లా పౌరవేదిక బృందంతో కలిసి మంత్రి కొండపల్లికి, ఎమ్మెల్యేలకు రాసిన లేఖలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రికి ఒపి, ఐపిల సంఖ్య పెరిగి ఇరుకుగదుల్లో రోగులు ఒకే మంచంపై ఇద్దరు ఉండే పరిస్థితి ఉందని. సీజనల్ వ్యాధులు వచ్చే వర్షాకాలంలో ఇది మరీ ప్రమాదమని అన్నారు. వైద్యం అందించే అన్ని విభాగాలకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కూర్చోడాని కి కూడా సౌకర్యాలు లేవన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందించ లేకపోతున్నారని, 70 ఎకరాల్లో 1500 బెడ్స్ (పడకల) విశాలమైన భవనాలు ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలోకి సర్వజన ఆసుపత్రిని మార్పు చేస్తే రోగులకు మంచి వైద్య సేవలు అందుతాయని భీశెట్టి అభిప్రాయ పడ్డారు. సమావేశంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, ఉపాధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, సహాయ కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్ రావు, సముద్రాల గురుప్రసాద్ పాల్గొన్నారు.

పర్యాటకశాఖ ఆధ్వర్యాన హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు

ప్రజాశక్తి-విజయనగరం

తిరుపతి కేంద్రంలోని భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 'స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజి, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి కుమారస్వామి తెలిపారు. బియస్‌సి (హెచ్ అండ్ హెచ్‌ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్-40శాతం పై బడిన వారి నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులో ప్రొడక్షన్, సర్వీసు, హౌస్ కీపింగ్ నేర్పించి 4నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తారని తెలిపారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు యస్.యస్.సి. పాసైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ కోర్సులో ఒక సంవత్సరము పాటు దేశ విదేశాల వంటకాలు నేర్పించి 6నెలలు ప్రముఖ ఫైవ్ స్టాం హోటల్స్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తారని తెలిపారు. సర్టిఫికేట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సుకు టెన్త్ పాసైన వారి నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ కోర్సులో ఐదు నెలల పాటు రెస్టారెంట్ , బార్ సర్వీస్ నేర్పించి 1 నెల ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఈ కోర్సులు పూర్తి అయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్ళు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్ళ లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇతర ఏదైనా సమాచారం కోసం 9701343846, 9100558006, 9700440604 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గజపతినగరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

వచ్చే నెల 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని స్థానిక సబ్‌కోర్టు న్యాయ మూర్తి ఎ.విజయరాజ్‌కుమార్ కోరారు. మంగళవారం కోర్టు ఆవరణలో పోలీసు అధికారు లతో సమావేశ మయ్యారు. అదాలత్‌లో కేసుల రాజీకి కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సిఐ జివివి రమణ, ఎస్‌ఐలు కిరణ్ కుమార్ నాయుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ టి.విమలరాణి మంగళవారం నగరంలోని సఖి -వన్‌స్టాప్‌సెంటర్‌ను సందర్శించి అక్కడున్న రికార్డులను పరిశీలించారు. వన్‌స్టాప్‌సెంటర్, ఉమెన్ హెల్ప్ లైన్-181 ద్వారా అందుతున్న సేవలు మహిళల ద్వారా ఎటువంటి సమస్యలు వస్తున్నాయి వాటికి ఎటువంటి సేవలు లభిస్తున్నాయో పరిశీలించారు. కార్యక్రమంలో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయి విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ముసురేసింది..

రైతుల్లో హర్షం • చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం నుంచి అక్కడక్కడా చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం మంగళవారం కూడా కొనసాగింది. వేకువ జాము నుంచి చిరు జల్లులు కురుస్తునే ఉన్నాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 5.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా మెంటాడ మండలంలో 24.6 మి.మీ వర్షం పడగా, వేపాడ మండలంలో 9.3, విజయనగరం రూరల్ మండలంలో 8.8, నగరంలో 6.8, జామిలో 8.2, కొత్తవలసలో 7.7, ఎస్.కోట 7.8, గుర్ల 7.6, లక్కవరపుకోటలో 7.2మి.మీ, నెల్లిమర్లలో 7.3, భోగాపురంలో 6.2 మి.మీ. వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 5 మి.మీ. లోపు వర్షం పడింది. వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ఈ ఏడాది ఇబ్బంది ఉండదని అంటున్నారు.

27న జాబ్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం

సీడాప్ - వెలుగు -జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెలుగు - డిఆర్‌డిఎ జిల్లా పథక సంచాలకులు ఎ. కల్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వత్స ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్‌లో జెడ్ డి జెడ్ ఇ సర్టిఫికేషన్స్ (వతీశీ ణవటవష్ వతీశీ జుటటవష్ జవతీఱటఱఫ్‌ఱశీఅం) కోసం ఫీల్డ్ కోఆర్డినేటర్‌లుగా విజయనగరం లో పనిచేయడానికి యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉద్యోగం కోసం యువకులు నుండి మాత్రమే దరఖాస్తు కోరుతున్నట్లు తెలిపారు. ఫీల్డు కోఆర్డినేటర్లు ఉద్యోగానికి నకు డిగ్రీ చదివి, 18-30 సంవత్సరాల వయస్సు కలిగిన యువకులు అర్హులని, ఇంటర్వ్యూ కు హాజరు కావచ్చునని తెలిపారు. జీతం 20 వేల నుండి 25 వేల రూపాయలు వరకు ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 27వ తేదీన(శుక్రవారం) ఉదయం 10 గంటల నుండి స్థానిక బి సి కాలనీలో గల టి.టి.డి.సి, విజయనగరంలో విద్యార్హత సర్టిఫికేట్లు, రెజ్యూంతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966754198 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జెసి నాయుడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమితులైన డాక్టర్ ఎం. జయచంద్ర నాయుడు కు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావు అభినందనలు తెలిపారు. మంగళవారం మహారాజా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఛాంబర్ లో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శివ శ్రీధర్,రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, వైద్యులు డాక్టర్ లోక్ నాథ్, డాక్టర్ అప్పలరాజు, డాక్టర్ వెంకటనాయుడు, డాక్టర్ మణికుమార్ పాల్గొన్నారు.



ఐసిడిఎస్ పీడీకి సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నాం

ఐసిడిఎస్ పీడీకి అంగన్వాడీల నోటీసు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులు, స్కీంవర్కర్ల సమస్యల పరిష్కారానికి జూలై 9న జరుగు దేశవ్యాప్త సమ్మెలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, మినీ వర్కర్లమంతా పాల్గొంటామని ఐసిడిఎస్ పీడీ టి.విమలరాణికి మంగళవారం యూనియన్ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి ప్రభుత్వం 42 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని, ఆ లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని, అంగన్వాడీలకి గ్రాడ్యూటీ కోసం ఇచ్చిన జీవో నెంబర్ 8 మార్పు చేయాలని, బాల సంజీవని యాప్‌ను మార్పు చేయాలని డిమాండ్ లతో సమ్మె జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీలంతా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నారని పీడీకి తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఎపి అంగన్వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పైడ్రాజు, ఎస్ అనసూయ, జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా నాయకులు పి.ప్రభ పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌పై ధ్వజమెత్తిన సభ్యులు

- వీధిదీపాల నిర్వహణపై కౌన్సిల్ సమావేశంలో ఆగ్రహం
- అజెండా చర్చించకుండా ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు; వేదికపై మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా సమస్యల పరిష్కారంలో కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్య వైఖరిపై కార్పొరేటర్‌లు గళం విప్పారు. వివిధ పన్నుల రూపంలో ఆదాయాన్ని ప్రజల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తోన్న అధికారులు ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సుదపాయాల కల్పనపై నిర్లక్ష్యం వహించడాన్ని కౌన్సిల్ ముక్త కంఠంతో ఖండించింది. ముఖ్యంగా ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల పని తీరు అస్తవ్యస్థంగా ఉందంటూ మండిపడ్డారు. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంలో గడిచిన ఏడాది కాలంలో కార్పొరేషన్ పరిధిలో బ్రిటీష్ పాలన సాగుతుందంటూ ఆవేదన చెందారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. 25 అంశాలలతో పాటు, టేబుల్ అజెండాగా మరి కొన్ని అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సమావేశం ప్రారంభ సమయంలో నిర్వహించిన జీరో అవర్‌లో ప్రజా సమస్యలపై కౌన్సిల్ సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. కార్పొరేటర్‌లు బండారు అనంద్, పిన్నింటి కళావతి, గుజ్జల నారాయణరావు, వింతప్రభాకర రెడ్డి, గాదం మురళి, కంటుభుక్త తవిటరాజు, ఆల్తి సత్యకుమారి, మారోజు శ్రీనివాసరావు తదితరులు వీధి దీపాల సమస్యను పదే పదే అధికారులకు గుర్తు చేస్తున్నా ఎందుకు నిద్ర నటిస్తున్నారో అర్థం కావటం లేదని ప్రశ్నించారు. నగరంలో సుమారు 2వేల వరకు వీధి దీపాలు వెలగకున్నా అధికారులు తప్పుడు లెక్కలు చూపిస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తునస్నారని మండిపడ్డారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో డివిజన్‌లలో పారిశుధ్య నిర్వహణ అవసరమైన సిబ్బంది లేక అధ్వానంగా వీధులు కనిపిస్తున్నాయని తెలిపారు.వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో ప్రోటోకాల్ పాటించకుండా పాలకవర్గ సభ్యులను అధికారులు అవమాన పరుస్తున్నారని పలువురు సభ్యులు మండిపడ్డారు. వార్డుల్లో జరుగుతున్న కార్యక్రమాలు, పనులలో టిడిపి నాయకులతో కొబ్బరికాయలు కొట్టించడం ఏమి సాంప్రదాయమని నిలదీశారు. ప్రజలతో ఎన్నుకోబడిన సభ్యులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.

22 అంశాలకు ఆమోదం..

అజెండాలో పొందుపరిచిన 25 అంశాలలో మూడు అంశాలను రద్దు చేయగా మిగిలిన అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఎజెండాలో అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో 36 వార్డు డివిజన్ కార్పొరేటర్ బాలి పద్మావతి స్టాండింగ్ కమిటి సమావేశంలో ఆమోదించిన ఎజెండాను మిగిలిన సభ్యులకు తెలియజేయాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం దాట వేస్తూ సమావేశాన్ని కొనసాగించారు.

చర్చకు రాకుండానే టేబుల్ ఎజెండా ఆమోదం

సాధారణ ఎజెండా అనంతరం టేబుల్ ఎజెండా చదవకుండా దానిపై చర్చించకుండా కౌన్సిల్ ఆమోదించినట్లు సమావేశాన్ని ముగించారు. కనీసం సభ్యుల దృష్టికి తేకుండా ఇష్ట మొచ్చినట్లు సమావేశాన్ని నిర్వహించడం పట్ల పలువురు కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేశారు.

నగరాభివృద్ధి ధ్యేయంగా కృషి : మేయర్

మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధి తో పాటు ఆరోగ్య నగరంగా కూడా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, కమిషనర్ పల్లి నలనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మింపేట బాధితులకు హైకోర్టులో ఊరట

ప్రజాశక్తి - వంగర

లక్ష్మింపేట బాధితులకు హైకోర్టులో ఊరట లభించింది. ప్రత్యేక కోర్టులో విచారణ వేగవంతం చేస్తామని, తప్పనిసరిగా హాజరుకావాలని అక్కడ కోర్టు ఆదేశించిన నేపథ్యంలో బాధిత దళితులు తమ తరపున వాదించేందుకు చట్టం ప్రకారంగా తాము కోరుకున్న పిపి లేనందున కోర్టుకు హాజరై తమ సమస్యను ఎవరితో చెప్పు కోలేమని, అందువల్ల తమకు అవకాశం కల్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. అయితే బాధితులకు ఇప్పటికే రెండు సార్లు అవకాశం కల్పించిన హైకోర్టు మంగళవారం మరోసారి జూలై 15 వరకు అవకాశం కల్పించిందని బాధిత దళితులు తెలిపారు. దీంతో కొంత ఊరట లభించిందన్నారు. అయితే హైకోర్టులో లక్ష్మింపేట దళిత బాధితులు తరపున వాదించేందుకు వారు కోరుకున్న పిపిని నియమించి విచారణ వేగవంతం చేస్తుందా లేదా తదుపరి ఎలాంటి తీర్పుని ఇస్తుందో వేచి చూడాల్సిందే.

లక్ష్మిం పేట కోర్టు జూలై 2కు వాయిదా

మండలంలోని లక్ష్మింపేట ప్రత్యేక కోర్టు జూలై 2కి వాయిదా పడింది. మంగళవారం కోర్టు ప్రారంభించి ముద్దాయిల(నిందితులు)ను పిలిచిన కొద్ది నిమిషాలకే జడ్జి వాయిదా వేశారు.

ఎస్‌పిని కలిసిన ఆర్మ్‌డ్ డిఎస్‌పి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు డిఎస్‌పిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వై.రవీంద్రారెడ్డి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి..డిఎస్‌పికి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసుల పాత్ర చాలా ప్రధానమైనదని, భద్రత, బందోబస్తులకు, ఇతర అవసరాలకు అనుగుణం గా ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందిని ఎప్పటికప్పుడు విధులకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రవీంద్రారెడ్డి గతంలో తిరుపతి జిల్లా ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో పని చేసి, బదిలీపై విజయనగరం జిల్లాకు వచ్చారు.

ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలసిన డిఎస్‌పి

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కొత్తవలస

కొత్తవలసలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెంనాయుడును ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎప్పుడూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అందులో భాగంగానే మంగళవారం ఉదయం విజయవాడలో పలువురు రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కింజరాపు అచ్చెంనాయుడులను మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో గిరిజన గ్రామాలకు రోడ్లు, గిరిజనులకు మెరుగైన తాగునీటి సదుపాయం అందించాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించడం కోసం కొత్త బస్సులు కేటాయించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరామన్నారు. కొత్తవలస పట్టణ కేంద్రంలో నూతన రైతు బజార్ ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెంనాయుడును కోరామని అందరూ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, మాజీ ఎంపిపి కొల్లి రమణ మూర్తి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, చింతలపాలెం సర్పంచ్ మాకిన నవీన్ పాత్రుడు, సాగర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

4న గంటి ప్రసాదం వర్ధంతి సభ

బొబ్బిలి : జులై 4న జరగనున్న గంటి ప్రసాదం వర్ధంతిను జయప్రదం చేయాలని ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా కార్యదర్శి ఆర్.సత్యం, డి.వెంకటరమణ కోరారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో మంగళవారం వర్ధంతి ప్రచార పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 4న 2013 నెల్లూరులో కిరాయి అంతకులు చేతిలో అమరుడైన కామ్రేడ్ గంటి ప్రసాదం నేటికీ 12 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా 12వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి కార్మికులు ప్రజా సంఘ నాయకులు కామ్రేడ్ గంటి ప్రసాదం అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆర్థిక సహాయం అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ప్రగతిశీల కార్మిక సమైక్య రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ అన్నపూర్ణ, కామ్రేడ్ కొండారెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం గోపాలం, పిల్ల లక్ష్మణరావు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. కరపత్రాలు విడుదలలో ప్రగతిశీల కార్మిక సమైక్య నాయకులు పిల్ల లక్ష్మణరావు, ప్రజా కళా మండలి రాష్ట్ర బాధ్యులు తూముల సింహాచలం, సీనియర్ కామ్రేడ్ బొత్స కన్నం నాయుడు, పాల్గొన్నారు.

ఆతవ సచివాలయం సందర్శన

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆకస్మికంగా సందర్శించారు. సచివాల సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కార్యాలయానికి సకాలంలో విధులకు హాజరుకావాలని, సచివాలయానికి వచ్చిన ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరిస్తూ మీ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. పరిధి దాటిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సిబ్బందిపై గ్రామం నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతూ తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సర్పంచ్ గొంప వేమన రామనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

తడి, పొడి చెత్తలను వేరు చేయాలి

డెంకాడ: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు తడి చెత్త పొడి చెత్త వేరు వేరు చేయాలని ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో పిడబ్ల్యుఎస్ క్లోరినేషన్ జరుగుతున్న విషయాన్ని పిడబ్ల్యుఎస్ ట్యాంక్ క్లీనింగ్ ఎస్‌డబ్ల్యు పిసి వద్ద తడి చెత్త పొడి చెత్త వేరు చేయు విధానాలను, గ్రామపంచాయతీ నిధులతో శ్మశాన వాటిక వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు తడి చెత్త ఇవ్వాలని పొడి చెత్తను చేస్తున్న శనివారం మాత్రమే ఇవ్వవలసిందిగా తెలిపారు. వర్మీ కంపోస్టను తయారుచేసి కేజీ పది రూపాయలకు అమ్మాలన్నారు. ప్రతి మండలంలో అన్ని పంచాయతీల్లో ఉన్న మంచి నీటి ట్యాంకులను తేదీలు ప్రకారంగా క్లీన్ చేసి శుభ్రపరచాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా కార్యదర్శులు బాధ్యత వహించి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లంక లక్ష్మణరావు, పంచాయతీ సెక్రెటరీ వెంకట్రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అక్రమ కనెక్షన్ తొలగింపు

వేపాడ: మండలంలోని ఆతవ సర్పంచ్ గొంప వేమనరాము నాయుడు ప్రజాధనంతో నిర్మించిన బోరుబావికి అక్రమ కనెక్షన్ ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఇవ్వవలసిన తాగునీటిని తన సొంతానికి వాడుకున్నట్లు కొంతమంది గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి మంగళవారం పరిశీలించి అక్రమ కనెక్షన్‌ను తొలగించారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్ ఇలా అక్రమ కనక్షన్ వేసుకోవడంతో పలువురు ఆక్షేపిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరును ప్రజలు వినియోగానికి కాకుండా తన సొంత వినియోగానికి వాడుతున్న సర్పంచ్ తీరుపట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు.

తప్పుడు భూనమోదుపై ఫిర్యాదు

వంగర: స్థానిక మండల కేంద్రానికి చెందిన 56 దళిత కుటుంబాలకు 35 ఏళ్ల క్రితం ఒక్కొక్క కుటుంబానికి డి పట్టా కలిగిన 60 సెంట్లు భూమి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఇప్పుడు అదే భూమిలో ఒక్కొక్క కుటుంబానికి 20 ఎకరాలు భూమి కలిగి ఉన్నట్లు రికార్డుల్లో తప్పుగా నమోదు కావడంతో తామంతా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర ప్రభుత్వ పథకాలకు అనార్హులం అవుతున్నామని అందువల్ల నష్టపోతున్నామని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పేరున తప్పుగా నమోదైన భూమిని సరిచేసి ప్రభుత్వ పథకాలు అందజేయాలని వారంతా కోరారు. ఈ మేరకు తహశీల్దార్ హరి రమణారావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్‌స్కూలు ప్రవేశ పరీక్ష

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల ఎపి ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్లుకు పెట్టిన ప్రవేశ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి 6,7,8,9 తరగతుల మిగులు సీట్లు భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న 65 రాత పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

అన్ని రకాల సర్వేలూ పూర్తి చేయాలి

వంగర: మండలంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సర్వేలూ త్వరితగతిన పూర్తి చేయాలని చీపురుపల్లి డిఎల్‌డిఒ హేమ సుందర్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మహిళ పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ ఎమౌంట్లు వెంటనే చలానా కట్టాలన్నారు. తల్లికి వందనం ఎక్కడైతే పెండింగ్ ఉన్నాయో అవి వెంటనే పరిష్కరించాలన్నారు. వర్షాకాలం అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పై శ్రద్ధ పెట్టి ఎక్కడా అంటు రోగాలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రఘునాథ చారి, కెల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

వంగర: రైతులు విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని కొప్పర, కొండచాకరాపల్లి గ్రామాలలో ఆయన మంగళవారం పర్యటించి పొలంపిస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించి ఖరీఫ్‌కు సంబంధించి వరి ఎదజల్లడం, నారుమడి కోసం విత్తనాలను సుడోమోనస్ లేదా ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. తద్వారా నేల విత్తనం ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునన్నారు. ముఖ్యంగా వరిలో అగ్గి తెగులు, పొడ తెగులు, కాండంకుళ్ళు తెగులు రాకుండా నివారించుకోవచ్చు అని రైతులకు అవగాహన కల్పించారు. పంట విత్తిన తర్వాత పైరుపై తెగులు కనిపించినట్లయితే పైరు పైన కూడా పిచికారి చేసుకోవచ్చునన్నారు. సుడోమోనోస్, ట్రైకోడెర్మా విరిడి రాయితీపై రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. వరి పంటలో కలుపు నివారణకు విత్తనం విత్తిన మూడు రోజుల లోపల ప్రిటిలక్లోర్ 400ఎంఎల్, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవలో పేర్లు రానివారు ఆధార్ కార్డు, 1బి వివరాలతో రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శివ, శాలిని, రైతులు పాల్గొన్నారు.

వేపాడ పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - వేపాడ

మండలం కేంద్రంలో గల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక అధికారి అచ్యుత కుమారి మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వర్షాకాలంలో గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయం రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గజపతినగరం ఎక్సైజ్ సీఐ జనార్ధన రావు అన్నారు. వెంకటాపురంలోని శ్రీకృష్ణ జూనియర్ కాలేజీలో మంగళవారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల, వాటి దుష్ప్రభావాలు పట్ల అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత ఎదుగుదలకు గొడ్డలి పెట్టి లాంటిదని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి, ఎవరైనా విక్రయించిన, రవాణా చేసిన సమాచారం తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నరేంద్ర, హెచ్‌సి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

బొబ్బిలి: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. బొబ్బిలి రాజా కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో బాగా చదివి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ దేముడు, ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ జై భీమ్

గంట్యాడ: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువత గంజాయి, మద్యానికి ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథ రావు, రూరల్ ఎక్సైజ్ సీఐ ఎం.విజయలక్ష్మి, కేవీ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: యువతీ యువకులు మత్తు పదార్థాల బారిన పడకుండా తమ ఆరోగ్యాలు కాపాడుకోవాలని, మత్తు పదార్థాలు సేవించడం చట్టరీత్యా నేరమని కొత్తవలస ఎక్సైజ్ సిఐ జి.ఎస్.రాజశేఖర్ నాయుడు తెలిపారు. జూన్ 26 అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మండలంలోని ప్రగతి డిఫెన్స్ అకాడమీలో మంగళవారం మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలకు యువత బానిసయితే జరిగే నష్టాలు, దాని వల్ల దేశానికి జరిగే నష్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, కాలేజీ యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం: ఎక్సైజ్ సీఐ జై.భీమ్ ఆధ్వర్యంలో రాజాం పట్టణంలోని విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ జి.మాన్యాలు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు జోలికి వెళ్ళవద్దని చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయి రామ్, అధ్యాపకులు, సిబ్బంది, ఈగల్ టీమ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్‌విఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాల వినియోగంపై భోగాపురం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, రవాణా వల్ల కలిగే నష్టాలు, మానసిక, శారీరక, సామాజిక పతనం గురించి వివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పైడి రాజు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సురేష్, కానిస్టేబుళ్లు మహేశ్వరరావు, సూర్యనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చీపురుపల్లి : ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

చీపురుపల్లి: మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని ఎక్సైజ్ సిఐ సిహెచ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా చీపురుపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా మాదక ద్రవ్యాలను సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు గురై కుటుంబానికి ప్రధాన ఆధారాలను కోల్పోతున్నారని దీని కారణంగా కుటుంబాలు వీధిన పడవలసిన దుస్థితి ఏర్పడుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జి.గిరీష్, సిబ్బందితోపాటు స్థానిక ఆటో డ్రైవర్లు ప్రజలు పాల్గొన్నారు.

తల్లికి వందనానికి ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేసేందుకు డేటా ఆన్‌లైన్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికి సచివాలయాలలో డేటా ఆన్‌లైన్ అవ్వడం లేదన్నారు. సాంకేతిక సమస్యను పరిష్కరించి డేటా ఆన్‌లైన్ చేసి తల్లికి వందనం ఇవ్వాలని కోరారు. పట్టణం విస్తరించినప్పటికీ పారిశుధ్య కార్మికులను పెంచకపోవడంతో పని భారం పెరుగుతుందని, పెరిగే జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. మరణించిన పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుల పిఎఫ్, ఇఎస్ఐ సెటిల్మెంట్లను సంబంధిత డిపార్ట్మెంట్‌లకు ప్రాసెస్ చేసే సకాలంలో అందేటట్లు చేయాలని కోరారు. పాకివీధి వెనుక మున్సిపాలిటీ స్థలం రహదారిని ఆక్రమించిన వారిపైన కేసులు పెట్టి మున్సిపల్ స్థలంలో నిర్మించిన గోడను తొలగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు వారం రోజుల్లో పరిష్కారం చేయకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి.గౌరీ, యుగంధర్, సాంబ, జి.శంకర్రావు, వెంకట్, కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఘనంగా బేబినాయన జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక కోటలో మంగళవారం ఎమ్మెల్యే బేబినాయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో బేబినాయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. బేబినాయనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు క్యూ కట్టారు. బుడా చైర్మన్ తెంటు రాజా, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు బేబినాయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. కోటలో ఏర్పాటు చేసిన రెలారే రెలా ఆకట్టుకుంది. జనంతో కోట కిక్కిరిసింది.

ఎమ్మెల్యేకు శుభకాంక్షలు చెబుతున్న తెంటు రాజా, తదితరులు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

డెంకాడ: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన పుట్టినరోజు సందర్భంగా బొబ్బిలి కోటలో ఆయనకు నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు, మాజీ ఎంఎపి వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణ రెడ్డి, ఎంపిటిసి పసుపులేటి గోపి, డెంకాడ టిడిపి మండల ఉపాధ్యక్షులు పడాల చిన్నారావు తదితరులు ఉన్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇరాన్‌పై అమెరికా దాడి చేయడం దుర్మార్గమని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ హమాలీలకు అమెరికా దాడిపై అవగాహన కల్పించి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా దాడి చేయడం దుర్మార్గమని దీనివల్ల ఆయిల్ సంక్షోభం ఏర్పడి దేశ ప్రజలపై భారాలు పడతాయన్నారు. అమెరికా దుర్మార్గపు దాడిని కేంద్ర ప్రభుత్వం ఖండించాలని డిమాండ్ చేశారు. అమెరికా ఇజ్రాయిల్‌తో చేతులు కలిపి ఇరాన్‌పై దాడి చేయడం పశ్చిమ ఆసియాపై పెత్తనం చేయడానికేనన్నారు. కాగా ఇరాన్ అణువ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేసినప్పటికి అమెరికా మాత్రం అణు ఆయుధాలు ఉన్నాయని ఎటువంటి ఆధారాలు లేకుండా ఇరాన్‌పై దాడి చేసిందన్నారు. దీని ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా శాంతి, సామాన్య ప్రజల జీవనోపాధిపై దెబ్బ పడుతుందని చెప్పారు. ఆయిల్ దిగుమతి కోసం పశ్చిమ ఆసియాపై ఆధారపడుతున్న మనదేశం కూడా తీవ్ర ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా ఇజ్రాయిల్ అనుకూల వైఖరి విడనాడి యుద్ధ నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న అమెరికా దాడి పై నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పి. లక్ష్మణరావు, కె. గోవింద, పి. రాంబాబు, కె. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న కిల్లంపల్లి రామారావు

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే జూలై 9వ తేదీన జరుగు దేశ వ్యాప్త సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటారని, పురిటి పెంట పంచాయతీ కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావుకు గజపతినగరం పంచాయతీ గుమస్తాకు, మంగళవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి లక్ష్మి ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి లక్ష్మి మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 132, 142, 680 జీవోలు, హైకోర్టు టెండర్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర క్యాబినెట్లో పోరాటం చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పనిని 12 గంటలు చేసి, మహిళలు రాత్రిపూట కూడా డ్యూటీలు చేయాలని నిర్ణయం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, బి గోవింద, పి. కృష్ణ, కే రాము, బి అప్పలస్వామి, గణేషు, మహంకాళి అప్పలరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి నోటీసు అందిస్తున్న కార్మికులు

పరిశ్రమల స్థాపనకు అనుకూలం

ప్రజాశక్తి- డెంకాడ (భోగాపురం)

నెల్లిమర్ల నియోజకవర్గం పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో ఎమ్మెల్యే లోకం నాగమాధవి 'ఇన్వెస్ట్ ఇన్ నెల్లిమర్ల' పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం కొండవాని పాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు అత్యుత్తమ వాతావరణం ఉందని, ప్రభుత్వం నుండి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. పారిశ్రామిక వేత్తలు తమ యూనిట్లను త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన అన్ని అనుమతులూ, సహాయ సహకారాలు అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఒక సంవత్సర కాలంలో విఎంఆర్‌డిఎ రహదారి సమస్యను పరిష్కరించడంలో తాను ఎదుర్కొన్న సవాళ్లను లోకం నాగ మాధవి వివరించారు. ఇటువంటి అడ్డంకులను అధిగమించి, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ పార్క్ ప్లాట్ యజమానులు, నూతన పారిశ్రామిక వేత్తలు, మిరాకిల్ సాఫ్ట్ వేర్ సిస్టమ్స్ వ్యవస్థాపక సిఇఒ లోకం ప్రసాద్, ఏపిఐఐసి జెడ్ఎం, డిఐసి జెడ్ఎం, ఎస్‌బిఐ భోగాపురం మేనేజర్, కెనరా బ్యాంక్ మేనేజర్, ఏపీఎస్ఈబీ ఏడి, ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

మండలంలో ఉద్యోగానికి అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి - సంతకవిటి

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు స్థానిక మండలాల్లో ఉద్యోగం చేసే అవకాశం కల్పించాలని యునైటెడ్ ప్రోగ్రెసివ్ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుగుబెల్లి కిరణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సంతకవిటిలోని ఎంపిడిఒ కె.సురేష్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు సర్వీస్ నిబంధనలు, నోషనల్ ఇంక్రిమెంట్స్, ప్రమోషన్స్ వంటి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. కొంతమంది ఉద్యోగులు బదిలీలు పెట్టికునే వారికి ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా మాత్రమే పారదర్శకంగా బదిలీలు చెప్పేట్టాలని కోరారు. అనంతరం సమస్యలుతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు చంద్రశేఖర్, లోకేష్, హేమసంతోష్, సత్యనారాయణ, తారక్, సంతోష్, శివ, మోసెస్, వాసు, కిరణ్, స్వప్న, గాయత్రి, వెంకటరమణ, జయ కిరణ్, రాంబాబు, ఉమామహేశ్ పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి- డెంకాడ

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో మండలంలోని జొన్నాడలో జనసేన ఉత్తరాంధ్ర ఎలక్షన్ కమిటీ సభ్యులు జనసేన సీనియర్ నాయకుడు దిండి రామారావు, నియోజకవర్గ వీర మహిళ అట్టాడ ప్రమీల ఆధ్వర్యంలో మంగళవారం ఏడాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్థానిక ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఏడాది కాలములో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేసుందన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే నాగమాధవి ఆధ్వర్యంలో నియోజవర్గం అభివృద్ధి జరుగుతోందన్నారు. అనంతరం గ్రామంలో సుమారు 300 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు హేమంత్, ప్రసాదు, సురేషు, శ్రీను, జగదీష్, సతీష్, శివ బాలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొట్టాపు మణికంఠ, తెంటు హరిప్రియ, కానూరు తులసి, రౌతు కిరణ్ పదోతరగతిలో మండలంలోనే అత్యధిక మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పసుపాం విద్యార్థికి ట్రిపుల్ ఐటి

పూసపాటిరేగ: మండలంలోని పసుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జక్కంపూడి భవానీ ట్రిపుల్ ఐటిలో ప్రవేశం పొందింది. పదవ తరగతిలో 575 మార్కులు సాధించి మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన భవానీ, ఇప్పుడు తన ప్రతిభతో ఉన్నత విద్యాప్రవేశానికి అర్హత సాధించి అందరినీ గర్వపడేలా చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నాగేశ్వరరావు ఇతర ఉపాధ్యాయులు భవానిని ప్రత్యేకంగా అభినందించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

వేపాడ: మండలంలోని జాకేరు ఎంపియుపి పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రావాడ రామసత్యం, రెడ్డి అప్పల సత్యం, బి అప్పారావు మాస్టర్లను జాకేరు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, అప్పలనాయుడు దంపతులు ఘనంగా సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ వంగలి వాసుదేవరావు ఉపాధ్యాయులు దాసరి సత్యవతి, పప్పు సరస్వతి, గ్రామ పెద్దలు కలసి ఉపాధ్యాయులు చేసిన సేవలకు కొనియాడి సన్మానించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న విద్యార్థులు చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు మాట్లాడుతూ మా పిల్లలకు మంచి విద్యాబోధన అందించి మండల స్థాయిలో మంచి ఫలితాలు సాధించారని కొనియాడారు. గ్రామ పెద్దలు తల్లిదండ్రులు విద్యార్థులు సాదరంగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికారు.

కోళ్ల ఫారం మూసివేయాలి

ప్రజాశక్తి- మెంటాడ

జయతి పంచాయతీ మధుర గిరిజన గ్రామం బిరసాడవలసకు ఆనుకొని వున్న కోళ్ల ఫారం మూతబడే వరకూ పోరాటం చేస్తామని గ్రామస్తులు తెలిపారు. కోళ్లఫారంను తొలగించాలని గత 19 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మెంటాడ గ్రామస్తులు వారికి మద్దతుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కోళ్లఫారం నుంచి వెలువడుతున్న వ్యర్థ పదార్థాల వల్ల మెంటాడ అనంతసాగరం చెరువులో మత్స్యసంపద విపరీతంగా నష్టం సంభవించిందని దీంతో చెరువు ఆయకట్టు భూములకు సాగునీరు కలుషితం కావడం, పలురోగాలకు గురికావడం జరుగుతుందని మెంటాడ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కోళ్లఫారం దుర్గంధం వల్ల కైలాం, జయతి, అమరాయివలస, చింతలవలస గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా గ్రామాల ప్రజలు 19 రోజులుగా పలువిధాలుగా నిరసనలు తెలుపుతున్నా అధికారులు మాత్రం స్పందించకపోవడం విచారకరమన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ అరుణకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నేతలు సబ్బవరపు రాజశేఖర్, పాండ్రంకి శ్రీనివాసరావు, టిడిపి నేతలు రెడ్డి రాజగోపాల్, పి.శ్రీనివాసరావు, రొంగలి కన్నబాబు పాల్గొన్నారు.

మహారాజశ్రీ, గజపతినగరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
I.A.No.332/24, O.S.No.114/2024
Between :
Nalajana Krishna Rao ....Petitioner/Plaintiff
Nalajana Kamakshi and 3 others ....Respondents/Defendants
To
D1/R1. Nalajana Kamakshi, W/o late Sankara Rao, H/o Kotlamadapu Veedhi, Near Gowda Veedhi, Vizianagaram Town & District
పై పిటీషనరు-వాది పై [illegible] I.A.332/24, OS 114/24 పై [illegible] ది 02-07-2025, ఉ॥ 10-30 గం॥లకు [illegible]
R.S.Harinadha Rao
Advocate for Petitioner/Plaintiff
Gajapathinagaram,
Cell : 9441568473

IN THE HON'BLE COURT OF III ADDL DIST JUDGE-CUM-FAMILY JUDGE, VIZIANAGARAM.
EA 177/2024 in EP. 108/2017 in FDIA. 685/2016 IN O.S. 18/2015
[illegible] ....డిక్రీ హోల్డర్
Vs
[illegible] (died) [illegible]
R.4. [illegible]
[illegible] ది 07-07-2025 [illegible] ఉదయం 10-30 [illegible]
[illegible]
విజయనగరం - 535000.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE VIZIANAGARAM
O.S. 305/2016
Between:
Smt. Sagubandi Appala Kondamma (Died) and others ......Plaintiffs
And:
Patheti Srinu and others ....Defendants
To
D-7: Mulagapaka Ramana, S/o late Venkataswamy, Aged 46 years, Hindu, Cultivation, Residing at Near Chaitanya Junior College, S.Kota, Vizianagaram District.
NOTICE.
Take notice that the plaintiffs filed the above suit for permanent injunction in which you are the 7th defendant and the said suit stands posted to 01-07-2025 for notice to you. If you got any objection in the above suit you can appear in person or through an advocate and file your objections if any on 01-07-2025 at 10-30 A.M in the above Court
L.SATYANARAYANA
Advocate for the plaintiffs,
Vizianagaram